

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.142 | 206 | 234 |
| సూర్యాపేట | రూ.150 | 220 | 250 |
| నల్లగొండ | రూ.149 | 216 | 246 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5 । కనిష్ఠం 25.2



# నిప్పుల కొలిమి



- సెగలు కక్కుతున్న సూర్యుడు
- ఉమ్మడి జిల్లాలో 46.6 డిగ్రీలు నమోదు
- నల్లగొండ జిల్లాలో 22 మండలాల్లో రెడ్ అలర్ట్

**నల్లగొండ, భువనగిరి అర్బన్, సూర్యాపేటటౌన్, మే 1:** ఉమ్మడి నల్లగొండ జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ప్రజలే కాకుండా పశుపక్షాదులు కూడా నీటి కోసం తండ్లాడుతున్నాయి. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మునుగోడు మండలంలో 46.6 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 39.9 డిగ్రీలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తిలో 41.0 డిగ్రీలు నమోదైంది. అనంతగిరిలో 46.3, పాలకీడులో 46.3, సూర్యాపేటలో 46.2, పెన్‌పహాడ్‌లో 46.0, మోతెలో 45.9, మట్టంపల్లి, మేళ్లచెర్వులో 45.8, నూతనకల్‌లో 45.7, ఆత్మకూర్(ఎస్)లో 45.6, కోదాడలో 45.5, హుజూర్‌నగర్‌లో 45.5, గరిడేపల్లి, చివ్వెంలలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో 44డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో అత్యధికంగా 45.6 డిగ్రీలు, తుర్కపల్లిలో అత్యల్పంగా 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే నల్లగొండ జిల్లాలో 22 మండలాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదు కావడంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడ గాడ్పులు.. నిప్పుల కొలిమిలో వెళ్లేందుకు వాహనదారులు భయపడుతున్నారు. భానుడి ప్రతాపానికి వడదెబ్బతో వృద్ధులు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండలు ముదరడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి వ్యాపారాలు కూడా డీలా పడుతుండగా రైతులు, కూలీలు, కార్మికులు ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం పని నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు ఎండ దెబ్బకు నిమ్మసోడ, చెరుకు రసం, పండ్ల రసాలు తాగి ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

**గత ఏడాది, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఇలా..**

| 2023 ఏప్రిల్‌లో | | | ఈ ఏడాది ఏప్రిల్‌లో | |
|---|---|---|---|---|
| తేదీ | గరిష్ఠం | కనిష్ఠం | గరిష్ఠం | కనిష్ఠం |
| 20న | 41.0 | 24.0 | 40.0 | 24.8 |
| 21న | 40.0 | 24.4 | 41.0 | 25.2 |
| 22న | 38.0 | 21.4 | 41.5 | 24.4 |
| 23న | 37.5 | 21.0 | 42.0 | 24.0 |
| 24న | 37.0 | 22.0 | 41.5 | 24.4 |
| 25న | 39.0 | 22.4 | 42.5 | 24.8 |
| 26న | 38.5 | 20.0 | 43.0 | 24.6 |
| 27న | 37.0 | 21.0 | 41.5 | 24.8 |
| 28న | 38.0 | 22.0 | 45.5 | 25.0 |
| 29న | 35.0 | 23.0 | 42.0 | 25.2 |
| 30న | 35.5 | 22.4 | 43.0 | 25.4 |

### ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి



డీహైడ్రేషన్‌కు గురైన వ్యక్తికి ప్రభుత్వం ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తుంది. ఓఆర్ఎస్ (ఓరల్ డీహైడ్రేషన్ సాల్యూషన్)లో సోడియం క్లోరైడ్ 2.6గ్రాములు, పొటాషియం క్లోరైడ్ 1.5గ్రాములు, సోడియం సిట్రేట్ 2.9గ్రాములు, చక్కెర 13.5 గ్రాములు ఉంటుంది. ఇవన్నీ కలిసిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకుంటే డీహైడ్రేషన్ నుంచి బయటపడవచ్చు. ద్రావణాన్ని కలిపే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి. ఒక లీటర్ నీటిలో మొత్తం ప్యాకెట్‌ను కలపాలి. కలిపిన ఓఆర్ఎస్‌ను 24 గంటల లోపు వినియోగించాలి. నీళ్ల విరేచనం అయిన ప్రతీ సారి ఈ ద్రావణాన్ని ఇవ్వాలి. రెండేళ్ల లోపు పిల్లలకు పావు గ్లాస్, 2-10 ఏళ్ల లోపు పిల్లలకు అర గ్లాస్, 10 ఏళ్లు దాటిన వారికి ఎంత తాగితే అంత ఇవ్వాలి. డీహైడ్రేషన్‌కు గురికాకుండాఉండేందుకు, వేసవి తపాన్ని తట్టుకునేందుకు శరీరంలో నీటి శాతాన్ని ఎప్పటికప్పటికీ పెంచుకుంటే మంచిది. ఎక్కువగా ద్రవ పదార్థాలు, నీరు అధికంగా ఉండే పండ్లు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవడం ఉత్తమం.

\- జగన్నాథచార్యులు, వైద్యుడు



# వడదెబ్బతో ప్రాణానికి ముప్పు

**వేసవిలో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు**



**కోదాడ, మే 1:** రోజురోజుకూ పెరుగుతున్న భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. వడదెబ్బతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ వేడిమికి శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం అధికం. వడదెబ్బతో నీళ్ల, రక్త విరేచనాలు, వాంతులు ఎక్కువైనప్పుడు శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. పెద్దలతో పోలిస్తే చిన్న పిల్లలు అధికంగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది. వాంతులు, విరేచనాలు, మూత్రం తరుచుగా రావడం, అసలు రాకుంటే జాగ్రత్తగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

### డీహైడ్రేషన్ లక్షణాలు

- మూత్రం ముదురు పసుపు పచ్చ రంగులో వస్తుంది.
- అకస్మాత్తుగా బరువు తగ్గుతారు. శరీరం పొడిబారుతుంది.
- లోతుకుపోయిన చమ్మలేని కళ్లు ఉంటాయి.
- చంటి పిల్లల మాడు లోపలికి పోతుంది.
- శరీరం సాగే శక్తిని కోల్పోతుంది.
- చర్మాన్ని రెండు వేళ్లతో (బొటన, చూపుడు) పైకి లాగినప్పుడు ముడత యథాస్థానానికి వెంటనే వెళ్లకనెమ్మదిగా వెళ్తే డీహైడ్రేషన్‌గా గుర్తించాలి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- డీహైడ్రేషన్‌కు గురైన వ్యక్తి నీరు, మజ్జిగ, తదితర పానీయాలు అధికంగా తీసుకోవాలి.
- విరేచనాలు అవుతున్న వ్యక్తికి వాంతులు అవుతున్నా, కాకపోయినా ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి.
- డీహైడ్రేషన్ అయిన వ్యక్తికి పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతీ 5నిమిషాలకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందిస్తూ ఉండాలి.
- పెద్దవారికి 3లీటర్లు, చిన్నవారికి లీటరు ద్రావణాన్ని ఇవ్వాలి.
- లీటర్ మరగకాచి చల్లార్చిన నీటిలో రెండు పెద్ద స్పూన్ల పంచదార లేదా తేనె, పావు స్పూన్ ఉప్పు, పావు స్పూన్ వంట సోడా లేదా, అర స్పూన్ ఉప్పు కలిపిన నీటిని తాగించాలి. వీలైతే అరకప్పు నారింజ రసం, నిమ్మ రసం ఈ నీటిలో కలిపి ప్రతీ 5నిమిషాలకు ఒకసారి ఇస్తూ ఉండాలి.
- చిన్న పిల్లలు దాహం అని చెప్పరు కనుక తల్లిదండ్రులే మాటి మాటికి నీటిని తాగించాలి.
- డీహైడ్రేషన్‌కు గురైనవారికి వాంతులు అవుతున్నా సరే ద్రావణం ఇవ్వడం నిలపొద్దు. వాంతులు అయితే కొద్ది కొద్దిగా ద్రావణాన్ని తాగించాలి.

# సామాజికాన్ని పట్టేందుకు



- ఓటు బ్యాంకు కలిగిన వర్గాలకు దగ్గరయ్యే వ్యూహాలు
- పట్టణాల్లో ఉద్యోగ, నిరుద్యోగ, ప్రొఫెషనల్స్, వృత్తిదారులపై దృష్టి
- ఆయా వర్గాలకు గాలం వేస్తున్న ప్రధాన పార్టీలు
- ప్రత్యేకంగా సమ్మేళనాలతో ఆకట్టుకునే యత్నాలు

**నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):** లోక్‌సభ సమరం వేడెక్కుతున్న కొద్దీ అభ్యర్థులు, పార్టీల నాయకులు సామాజిక సమీకరణాలపై దృష్టి సారించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో ఎక్కడ ఏ వర్గం ఏ రకమైన ప్రభావాన్ని చూపగలుగుతుందనే అంచనాల్లో ఆయా పార్టీల నేతలు, వ్యూహకర్తలు మునిగితేలుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజికవర్గాల మద్దతుకు ప్రయత్నిస్తున్న పార్టీలు, పట్టణ ప్రాంతాలకు వచ్చేసరికి కార్మిక, ఉద్యోగ, నిరుద్యోగ, విద్యార్థి వర్గాలతో పాటు, ప్రొఫెషనల్స్, ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్నారు. ఓ వైపు ర్యాలీలు, రోడ్‌షోలతో ప్రచారం సాగిస్తూనే, మరోవైపు ఆయా వర్గాల సమ్మేళనాలు, గెట్ టుగెదర్‌లకు హాజరవుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

**ఓటు బ్యాంకు ఉన్న సామాజికవర్గాలపై కన్ను**

ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో వేర్వేరు సమీకరణాలు తెరమీదకు వచ్చాయి. నల్లగొండ లోక్‌సభ స్థానంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులతో పాటు అత్యధిక ఓటర్లు కలిగిన లంబాడ (ఎస్టీ), యాదవ్ (బీసీ) సామాజికవర్గాలతో పాటు దళిత సామాజికవర్గ ఓట్లపై ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలు దృష్టి సారించారు. ఈ రెండు వర్గాల్లో అత్యధిక ఓటుని సాధిస్తే గెలుపునకు దగ్గరిదారి ఏర్పడుతుందనే అంచనాతో నేతలు కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బరిలో ఉన్న ప్రధానపార్టీల అభ్యర్థులు కుందూరు రఘువీర్‌రెడ్డి (కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ) ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఎక్కువ ఓట్లున్న సామాజికవర్గాలపై దృష్టి సారించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) ఓసీ, డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ (బీజేపీ), క్యామమల్లేశ్ (బీఆర్ఎస్) బీసీ, ఎండీ.జహంగీర్ (సీపీఎం) మైనార్టీ వర్గానికి చెందిన వారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటింగ్ ఉన్న గౌడలతోపాటు, గొల్ల, కురుమ, పద్మశాలి, ముదిరాజ్ తదితర బీసీ సామాజికవర్గాలు, దళిత సామాజికవర్గం ఓట్లపై మూడు పార్టీలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఈ వర్గాల నుంచి అత్యధిక ఓట్లు తెచ్చుకోవడం ద్వారా గెలుపును అందుకోవాలనే ప్రయత్నాలను ఆ పార్టీలు ముమ్మరం చేశాయి. ఈ వర్గాల ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అసెంబ్లీ నియోజకవర్గస్థాయిల్లో ముఖ్యులతో సమావేశాలు, సమ్మేళనాలు నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ వర్గాలతో పాటు తక్కువ ఓటు బ్యాంకున్నప్పటికీ ఐక్యంగా ఓటింగ్‌కి అవకాశమున్న మరికొన్ని బీసీ వర్గాలు, మైనార్టీ ఓటర్లపై కూడా దృష్టిసారించారు. పార్టీలు, అభ్యర్థుల తరఫున ఈ వర్గాలకు చెందిన కీలకనేతలు, జిల్లా, రాష్ట్రస్థాయి బాధ్యతల్లో ఉన్న నేతలు ఓటర్లను సమీకరించే పనిలో పడ్డారు.



### పట్టణ ప్రాంత ఓటర్లకు గాలం

గ్రామీణ ప్రాంతాల్లో సామాజికవర్గాల వారీగా ఓటర్లను ప్రసన్నంచేసుకునే కార్యాచరణ అమలు చేస్తున్న పార్టీలు పట్టణ ప్రాంతాల్లో అందుకు భిన్నమైన రీతిలో ఓటర్లను సమీకరించే పనిలో పడ్డాయి. ప్రధానంగా పట్టణాల్లో నివసించే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, వృత్తిపనివాళ్లను తమవైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆయా పార్టీల ఎజెండాలతో పాటు వ్యక్తిగతం తమకు మద్దతు ఇస్తే అన్ని విధాలా అండగా ఉంటామనే హామీతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌లో ఎక్కువగా పాల్గొనే ఈ వర్గాలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ఓట్లను పెంచుకోవచ్చని ఆయా పార్టీలు భావిస్తున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయాల ప్రభావం సైతం ఈ వర్గాలపై ఉంటుండడంతో మద్దతు సంపాదిస్తే విజయానికి దగ్గరిదారి ఉంటుందని ఆయా పార్టీలు వ్యూహాలను అమలుచేస్తున్నాయి.

**కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి**



కష్టజీవుల రోజు మేడేను బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఎర్ర జెండాలను చేతబట్టి కమ్యూనిస్టులు, మూడు రంగుల జెండాను చేతబట్టి కాంగ్రెస్ నేతలు, గులాబీ, కాషాయ జెండాలు చేతబట్టి బీఆర్ఎస్, బీజేపీ నేతలు ర్యాలీలు నిర్వహించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినదించారు. ఆయా పార్టీలు, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో తమ తమ కార్యాలయాల్లో కార్మిక జెండాలు ఎగురవేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఉత్సాహంగా టెన్నిస్ జాతీయ పోటీలు

- ఇప్పటివరకు 100కు పైగా మ్యాచ్‌లు
- నేడు క్వార్టర్ ఫైనల్స్



టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు



**భువనగిరి టౌన్, మే 1:** జాతీయ అండర్-14 టెన్నిస్ సిరీస్ భువనగిరిలో ఉత్సాహంగా కొనసాగుతోంది. సిరీస్ ప్రారంభమైన మూడు రోజుల నుంచి బుధవారం వరకు వందకు పైగా మ్యాచ్‌లు జరగగా, గురువారం క్వార్టర్ ఫైనల్స్ జరగనున్నాయి. ఎనిమిది మంది బాలురు, ఎనిమిది మంది బాలికలు క్వార్టర్ ఫైనల్స్ అర్హత సాధించారు. వీరిలో నలుగురు బాలురు, ఒక బాలిక తెలంగాణ క్రీడాకారులు ఉండడం విశేషం. శుక్రవారం సెమీ ఫైనల్స్ శనివారం ఫైనల్స్ జరుగుతాయి. విజేతలకు ట్రోఫీతోపాటు నేషనల్ అండర్-14 ర్యాంకింగ్స్ ఇవ్వనున్నారు.

**క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన క్రీడాకారులు**

**బాలురు:** అతర్వ శ్రీరామోజు, జీబు సిద్ధార్థ, వానిజ్ ఆర్యన్ పోతునూరి, సీడీ ప్రణీత్‌రెడ్డి (తెలంగాణ), పునీత్ ఎం, అర్జున్ మణికందన్ (కర్ణాటక), ఫజల్ అలీమీర్ (తమిళనాడు), లక్ష్యవర్ధన్‌నాయకుడు చుక్క (ఆంధ్రప్రదేశ్).

**బాలికలు:** సావనిరెడ్డి వుంధ్యాల (తెలంగాణ), ప్రణిత వట్టప్రంబిల్ (ఆంధ్రప్రదేశ్), శ్రీషితి కిరణ్, ఆద్య చౌరసియా, రీతు జవహర్ (కర్ణాటక), దీప్తి వెంకటేషన్ (తమిళనాడు), శివాని గుప్త, శ్రావి డోరె (మహారాష్ట్ర).

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఈవీఎంల పనితీరుపై అవగాహన ఉండాలి
- కలెక్టర్ హనుమంతు కే. జెండగే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

**భువనగిరి రూరల్, మే 1:** ఎన్నికల విధులు, ఈవీఎం యంత్రాల విషయంలో పీవో, ఏపీవోలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే. జెండగే అన్నారు. బుధవారం భువనగిరి శివారులోని విద్యాజ్యోతి హైస్కూల్‌లో ప్రిసైడింగ్ అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధానంపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన హాజరై పలు సూచనలు, సలహాలు అందజేశారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 1,336 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత కింద శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ రోజు నిర్వహించే విధుల్లో ముఖ్యంగా ఈవీఎం యంత్రాల పనితీరుపై పూర్తి అవగాహన పొందాలన్నారు. పోలింగ్ ముందు రోజు చెక్ లిస్ట్ ప్రకారం మెటీరియల్ తీసుకోవాలని, ఈవీఎం యంత్రాలు పరీక్షించుకోవాలని, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు ఉదయం 5.30గంటలకు మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ ఏజెంట్లు అందరూ వచ్చే విధంగా వారికి సమాచారం ఇవ్వాలన్నారు. చూపులేని దివ్యాంగ ఓటర్లు సహాయకుడితో ఓటు వేసేందుకు ఫారం-14ఏ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, డీఈవో కె నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా అభివృద్ధి ఘనత మాధవరెడ్డిదే

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి అయిలయ్య యాదవ్



చౌటుప్పల్ లో కేక్ కట్ చేస్తున్న జక్కలి అయిలయ్య యాదవ్

**చౌటుప్పల్ టౌన్, మే 1:** ఉమ్మడి నల్లగొండ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎలిమినేటి మాధవరెడ్డికి దక్కుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జక్కలి అయిలయ్య యాదవ్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎలిమినేటి మాధవరెడ్డి 75వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయిలయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లో మాధవరెడ్డి చేయించిన అభివృద్ధి పనులే నేటికీ దర్శనమిస్తున్నాయని, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, పేద వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. మాధవరెడ్డి ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు బి.మల్లారెడ్డి, నాయకులు నల్ల పర్వతాలు, ముత్యాల పాపిరెడ్డి, గుమ్మడి అంజిరెడ్డి, మారగోని అశోక్, ఎడ్ల రామ్‌రెడ్డి, తడక కోటేశ్వర్, చెవగోని వెంకటేశం, దేప శ్యామ్‌సుందర్, సుంకరి జంగయ్య, యాట వెంకటేశం, పి.గోవిందాచారి, నూనె వెంకటేశం, బోదుల గణేష్, ఉపేంద్రచారి, అయిలయ్య పాల్గొన్నారు.

**మాధవరెడ్డి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి**

**భువనగిరి రూరల్:** దివంగత మాజీమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి అన్నారు. మాధవరెడ్డి జయంతిని పురస్కరించుకొని బుధవారం మండలంలోని వడపర్తి గ్రామశివారులో మాధవుని ఘాట్‌వద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ పెంట నర్సింహ, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, ఎంపీటీసీ ఉడుత శారద అంజనేయులు, పుట్ట వీరేశ్ యాదవ్, చిన్నం పాండు, సత్తిరెడ్డి, పరమేష్, డొప్ప వెంకటేష్, బచ్చు వెంకటేష్, యాట కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం

- ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తి మాధవిలత



సమావేశంలో మాట్లాడుతున్న మాధవిలత

**భువనగిరి రూరల్, మే 1:** కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరమని ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.మాధవి లత అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకొని బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక సంక్షేమ చట్టాలు, కార్మికులకు చట్టపరమైన సంక్షేమ పథకాలు, న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్‌గౌడ్, ప్రభుత్వ న్యాయవాది నాగారం అంజయ్యలు మాట్లాడుతూ కార్మిక శక్తి దేశ భవితకు పునాది అని, వారికి ఉచిత సేవలు అందించడానికి తమ న్యాయవాదుల ప్యానల్ ద్వారా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సహాయ న్యాయవాది జి.శంకర్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.జైపాల్, సహాయ ప్రభుత్వ న్యాయవాది బి.కేశవరెడ్డి, సీనియర్ న్యాయవాదులు, కార్మికులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా నిత్య పూజలు

**భువనగిరి అర్బన్, మే 1:** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.32,27,683 ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.



కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

### స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం

యాదగిరిగుట్ట స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని నేవీ అధికారులు వైస్ అడ్మిరల్ రాజేష్ పెండర్కర్, రేర్ అడ్మిరల్ రవ్‌నీష్ సేత్ అన్నారు. యాదగిరి క్షేత్రాన్ని బుధవారం నేవీ అధికారులు దర్శించుకున్న తర్వాత వేదపండితులు వారికి మండపంలో వేద ఆశీర్వచనం అందజేయగా ఈవో ఏ.భాస్కర్‌రావు స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు. యాదగిరిగుట్ట ఎంతో మహిమాన్వితమైన క్షేత్రమని కొనియాడారు. ఆలయ విశిష్టతను, పునర్నిర్మాణ విశేషాలను వారికి ఈవో వివరించారు.

## యువజన కాంగ్రెస్ పనితీరుపై సమీక్ష

**హైదరాబాద్, మే1(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి నలగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో లోకసభకు పోటీచేస్తున్న పార్టీ అభ్యర్థులకు విజయం చేకూర్చడంతో పాటు ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని రాష్ట్రయువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి యువజన కాంగ్రెస్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన ఉమ్మడి నలగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యువజన కాంగ్రెస్ పని తీరును సమీక్షించారు. ప్రతినిధులకు ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పరిచయం చేశారు. ఉమ్మడి నలగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన యూత్ కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**హుజూర్‌నగర్, మే 1:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని శివాలయం బజారుకు చెందిన తోట యేసుదయ(26) బుధవారం ఇంటి నుంచి అదృశ్యమైంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని తోట పద్మకు ఇద్దరు కుమార్తెలు. కాగా ఏసుదయ చిన్నకుమార్తె. ఆమెకు వివాహం కాలేదు. కాగా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. బుధవారం ఉదయం తోట పద్మ పెద్దకుమార్తెతో కలిసి పోస్టాఫీస్ వద్దకు వెళ్లి పింఛన్ తీసుకుని రాగా చిన్నకుమార్తె ఏసుదయ ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఏసుదయ అక్క వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**త్రిపురారం, మే1:** నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒక ఇంట్లో అప్పాల సుదర్శన్, ఈట నాగరాజు, ఉప్పు రాజేష్, భైరం దశరధ, వల్లూరి సుబ్బారావు, పేకాట ఆడుతున్న సమయంలో హెడ్ కానిస్టేబుల్ పాపులు తన సిబ్బందితో కలిసి వెళ్లగా వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.7610 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో మిర్చిపంట దగ్ధం


దగ్ధమైన మిర్చిపంట, పైపులు

గుర్రంపోడు, మే 1: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని జూనూతుల గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు మిర్చిపంట దగ్ధమైంది. కుంభం మోహన్ అనే రైతుకు చెందిన మిర్చి పంట 7-బీ డిస్ట్రిబ్యూటరీ కాల్వలో ఉన్న జమ్మికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని వ్యాపించడంతో పక్కనే ఉన్న మిర్చి పంటతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు కాల్వలో నిప్పు వేసి ఉంటారని భావిస్తున్నారు. కరెంటు మోటారుతో పాటు డ్రిప్ పైపులు దగ్ధం కావడంతో సుమారు రూ.70వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

## బాలికపై లైంగికదాడి.. కేసు నమోదు

యాదగిరిగుట్ట రూరల్, మే 1: బాలికపై లైంగికదాడి చేసిన యువకుడిపై కేసు నమోదైంది. సీఐ రమేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన బాలికను యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన ఎస్‌కె. మసూద్ ఈ నెల 29న పాతగుట్ట గ్రామానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాలిక తల్లి యువకుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువకుడిపై లైంగికదాడి నేరం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ, మే, 1: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని ముదిగొండ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు దేవరకొండ సీఐ నరసింహులు తెలిపారు. ముదిగొండ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా ఇరుగుతుందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మారపాకల గిరి, మారపాకల నగేష్‌లపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

# లారీలు రావు.. బస్తాలు ఎత్తరు

- బస్తాకు రూ.3 ఇస్తేనే లారీలు పంపుతామంటున్న డ్రైవర్లు
- ఐదారు రోజులుగా ఎగుమతి కాని ధాన్యం బస్తాలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల అరిగోస
- లారీలు రాక తూకం తగ్గడంతో కోతపెడుతున్న మిల్లర్లు


మోత్కూరు మార్కెట్లో లారీలు రాక, మిల్లుకు ఎగుమతి కాక నిలిచిపోయిన తూకం వేసిన ధాన్యం బస్తాలు

మోత్కూరు, మే 1: 'ధాన్యం పండించడం కంటే విక్రయించడానికే కష్టపడాల్సి వస్తోంది.' ఇదీ రైతుల ఆవేదన. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల రోజులు అవుతున్నా తూకాలు కావడం లేదు. తూకాలు వేసిన బస్తాలు రైస్ మిల్లులకు ఎగుమతి కావడం లేదు. రైతులను ఇరకాటంలో పెట్టి లారీల యజమానులు(డ్రైవర్లు), మిల్లర్లు అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తూకం వేసిన బస్తాలు మిల్లులకు ఎగుమతి చేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకుని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌ను నియమించింది. కాంట్రాక్టర్ సకాలంలో లారీ పంపడం లేదని పలువురు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు చార్జీ చెల్లిస్తుండగా లారీల డ్రైవర్లు బస్తాకు రూ.3 చొప్పున అదనంగా రైతుల నుంచి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇస్తేనే బస్తాలు తీసుకెళ్లడానికి లారీలు పంపుతున్నారని, లేకుంటే పంపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు పంపక తూకం వేసిన బస్తాలు ఐదారు రోజులు ఎండలో ఉండే సరికి ధాన్యం తూకం తగ్గుతోంది. మిల్లుకు పంపగానే రైస్ మిల్లరు తూకం తక్కువ వచ్చిందని కోత పెడుతున్నారు. ఈ సంకట పరిస్థితిలో కొందరు రైతులు డబ్బులు ఇస్తుండటంతో డబ్బులు ఇచ్చిన వారికే లారీలు పంపుతున్నారు. తాము ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే పంపిస్తామని చెప్పడమే గాని లారీలు పంపడం లేదని పలు ధాన్యం కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. లారీలు రాక మండలంలోని బుజిలాపురంలో 2,700 బస్తాలు, దత్తప్పగూడెంలో 1,300 బస్తాలు, పొడిచేడులో 1,032బస్తాలు, మోత్కూరులో 1,131బస్తాలు, అనాజిపురంలో 300 బస్తాలు ఐదారు రోజులుగా ఎగుమతి కాకుండా కేంద్రాల్లో ఉన్నాయి. తూకం వేసిన బస్తాలు ఎగుమతి కాకపోవడంతో కాంటాలు నిలిపివేస్తున్నారు. బస్తాకు రూ.మూడు చొప్పున ఇస్తేనే వస్తామంటూ డ్రైవర్లు లారీలు తీసుకరావడం లేదని బుజిలాపురం రైతులు చింతల నారాయణరెడ్డి, మడిమున్కల రాజిరెడ్డి, చెడిపల్లి లింగయ్య, దత్తప్పగూడెం రైతులు కన్నెబోయిన సత్తయ్య, ఎలుగు నర్సింహ, నాయిని శంకరయ్య, ఎలుగు గంగుమల్లు తెలిపారు.

వర్షం వస్తే తూకం వేసిన బస్తాలు, రాశులు తడుస్తాయని ఆవేదన చెందుతున్నారు. రవాణా చార్జీలు గిట్టుబాటు కాకుంటే ప్రభుత్వంతో మాట్లాడుకోవాలి కాని తమను అదనంగా డబ్బులు ఇవ్వమని వేధించడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తమకే నేరుగా రవాణా చార్జీలు చెల్లిస్తే తామే ట్రాక్టర్లు, డీసీఎంల ద్వారా ధాన్యం మిల్లులకు చేర్చుతామంటున్నారు. ఈ విషయాన్ని మోత్కూరు సింగిల్ విండో సీఈవో కె. వరలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లగా తూకం వేసిన బస్తాలు తీసుకెళ్లడానికి లారీలు రాకపోవడం వాస్తవమేనన్నారు. తాను ఎన్నోమార్లు ట్రాన్స్‌పోర్టు కంట్రాక్టర్, జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తున్నా లారీలు రావడం లేదని తెలిపారు.

## అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

**మాజీమంత్రి జానారెడ్డికి జగదీష్‌రెడ్డి సవాల్**


విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, మే 1: తాను మంత్రిగా పదేళ్లలో చేసిన అభివృద్ధి, కుందూరు జానారెడ్డి మంత్రిగా పనిచేసిన 17ఏళ్లలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం కావాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఇటీవల జానారెడ్డి సూర్యాపేటకు వచ్చిన సందర్భంగా సూర్యాపేటలో తనపై విమర్శలు చేశారని ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారని, ఆయన చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉండి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జానారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు సొంత నియోజకవర్గంలోనే ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. జానారెడ్డి పెద్దరికం నిలుపుకోవాలని, అలాంటి వ్యక్తి కూడా అబద్ధాలు ఆడటం సమంజసం కాదన్నారు. తాను పదేళ్లుగా మంత్రిగా ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషిచేశానన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానని ఒక మంత్రి అనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ప్రతిరోజూ అక్రమ కేసులు పెడుతూ పోలీస్ రాజ్యం నడిపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పోలీసులు ఇచ్చిన ఒక్క నోటీసుకే వణికిపోతున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి ఇచ్చిన నోటీసు కేంద్రంలోని బడేబాయి, రాష్ట్రంలోని చోటేబాయిల మధ్య జరుగుతున్న డ్రామా అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్‌ను అరెస్టు చేయడం దారుణమని, పోలీసులు డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై డీజీపీ స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసుల రూపంలో ఎవరైనా కిడ్నాప్ చేశారనే విషయం తేలాలన్నారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్, నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, రెగట్టే మల్లికార్జున్‌రెడ్డి, చీరా పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జమాల్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో పోరాడాలి : జూలకంటి


కళాకారులతో కలిసి కోలాటం ఆడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మే 1: మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లగా మార్చి కార్మికుల హక్కుల్ని కేంద్రం కాలరాస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఏటా లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ ఆ లోటును పూడ్చేందుకు సామాన్యులపై పన్నుల భారం మోపుతోందన్నారు. ధరల పెరుగుదల, పెరుగుతున్న నిరుద్యోగానికి తోడు ప్రైవేటీకరణతో పని భద్రత కరువవుతోందన్నారు. గ్రామీణ ఉపాధి హమీ పథకానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్‌లో కోతలు పెట్టిందన్నారు. కమ్యూనిస్టులు కాకుండా ఇతర సంఘాలు, పార్టీలు సైతం మేడే ఉత్సవాలను నిర్వహిస్తున్నప్పటికి కార్మికుల పోరాట చరిత్రను ప్రజలకు చెప్పడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్, సీఐటీయూ నాయకులు మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, బావండ్ల పాండు, తిరుపతి రాంమూర్తి, రెమిడాల పరుశరాములు, గాదె పద్మ, వరలక్ష్మి, అం జద్ వినోద్ నాయక్, పిల్లుట్ల సైదులు, బాబునాయక్, వెంకట్‌రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

యాదాద్రి, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయగిరిలో గల వినోద పారా బాయిల్డ్ రైస్‌మిల్లులో రాష్ట్ర సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వీఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఎంఆర్ రైస్ నిల్వలు ఎఫ్‌సీఐకి లక్ష్యం మేరకు అప్పగించారా? మిల్లులో ధాన్యం నిల్వలు ఎంత మేరకు ఉన్నాయని పరిశీలించారు. మిల్లుకు సంబంధించిన యాజమాన్యం ఎంతమేరకు ధాన్యం నిల్వచేసుకుంది, సీఎంఆర్‌కు సరిపడ ధాన్యం ఉన్నదా? లేదా అని గోదాముల్లోనూ తనిఖీలు చేపట్టారు. రైస్ మిల్లుకు సంబంధించిన లెక్కలను రాత్రి పొద్దుపోయే పరిశీలించారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దేవరకొండ, మే, 1: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని ఇద్దంపల్లిలో బుధవారం జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి. జైపాల్‌రెడ్డి(48) వ్యవసాయ పనులతో పాటు ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం గ్రామానికి చెందిన ఎస్‌కే. బాల్బి అనే మహిళ ఇంట్లో ఫ్యాన్ మరమ్మతులకు గురైందని జైపాల్‌రెడ్డికి ఫోన్ చేయగా ఆయన బాల్బి ఇంటికి వెళ్లాడు. ఫ్యాన్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జైపాల్‌రెడ్డి తండ్రి పాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలి

● **సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి**


వేములపల్లిలో మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

వేములపల్లి, మే 1: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నియంతృత్వ పాలన సాగిస్తున్న బీజేపీ, అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి తరుపున నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు 2కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి కేవలం 30లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించి భారత యువతను మోసం చేసిందన్నారు. ముస్లింలకు కాంగ్రెస్ నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి వాటిని మరికొంతకు పెంచే యోచనలో ఉంటే బీజేపీ మాత్రం ముస్లింల రిజర్వేషన్ల రద్దుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎన్నికల హామీ మేరకు ఐదు న్యాయపత్రాల ద్వారా 25హామీలను నెరవేర్చడంతోపాటు ప్రతి మహిళా ఖాతాలో రూ.లక్ష జమా చేస్తుందన్నారు. రాష్ట్రంలో పది సంవత్సరాలుగా అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిమయంలో కూరుకుపోయిందన్నారు. కోట్ల రూపాయల అప్పుల్లో తెలంగాణను నిట్టనిలువునా ముంచిందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అనేక బహుళార్థక ప్రాజెక్టు అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులను కట్టి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే హరిత విప్లవం ద్వారా ఆహార ధాన్యాలు గణనీయంగా ఉత్పత్తి సాధించి నిల్వలు చేసుకుంటే బీజేపీ అధికారం చేపట్టిన తరువాత వాటిని సివిల్ సప్లయ్ ద్వారా పంపిణీ చేస్తూ తామే అభివృద్ధిలో ముందున్నామని చెప్పుకుంటుందన్నారు. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకుడు తీన్మార్ మల్లన్న, టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, ఎంపీపీ పుట్టల సునీత, నాయకులు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, తమ్మడబోయిన అర్జున్, పుట్టల శ్రీను, రేగట్టె రవీందర్‌రెడ్డి, కందిమళ్ల లక్ష్మారెడ్డి, పిల్లల సందీప్, బీరవెల్లి సతీష్‌రెడ్డి, పుట్టల కృపయ్య, బొంగర్ల వినోద్, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పేరెల్లి నగేష్, నాగవెల్లి మధు, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌కు న్యాయవాదులంతా మద్దతు తెలపాలని సీఎల్పీ మాజీ నేత కుందురూ జానారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన అభ్యర్థి రఘువీర్‌తో బుధవారం నల్లగొండ జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఎంతో ఆలోచన కలిగిన వ్యక్తులు న్యాయవాదులని, అలాంటి వారు ఆలోచించి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. న్యాయవాదుల సమస్యలు తనకు తెలుసుకని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఫోర్జరీ సంతకాలతో రూ.15.90లక్షలు బదిలీ

సూర్యాపేట అర్బన్, మే 1: ఫోర్జరీ సంతకాలతో తమ కుమార్తె బ్యాంకు ఖాతా నుంచి తమ కుమారుడు రూ.15.90లక్షలు ఆయన ఖాతాకు బదిలీ చేసుకున్నాడని, ఆ డబ్బులను రికవరీ చేసి న్యాయం చేయాలని సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన వంగపెల్లి లక్ష్మీనారాయణ, పుష్పలత దంపతులు కోరారు. సూర్యాపేటలోని తమ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, అందరికీ పెళ్లి చేశామన్నారు. కుమారుడు అమెరికాలో నివసిస్తుండగా, చిన్న కుమార్తె తేజశ్రీ కెనడాలో నివసిస్తుందన్నారు. గత ఏడాది నవంబరు 23వ తేదీన తమ ఇంటికి కుమారుడు వంగపెల్లి సంతోష్, కోడలు స్వాతితో పాటు వియ్యంకుడు మేడిశెట్టి భద్రీనాథ్ వచ్చాడన్నారు. తమ పేరిట ఉన్న ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు కుమారుడు యత్నించగా తాము అంగీకరించలేదన్నారు. అనంతరం తమను ఏమార్చి బీరువాలో భద్రపర్చిన విలువైన వస్తువులు, ఆస్తి పత్రాలు, మిర్యాలగూడ కరూర్ వైశ్యా బ్యాంక్‌కు సంబంధించిన కుమారుడి జాయింట్ బ్యాంకు లాకర్ తాళాలు, కుమార్తె తేజశ్రీ ఖాతాకు చెందిన సూర్యాపేట ఐసీఐసీఐ బ్యాంకు చెక్కులను దొంగిలించారన్నారు. ఈ విషయాన్ని సూర్యాపేట పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తర్వాత కుమార్తె తేజశ్రీ ఖాతా నుంచి ఫోర్జరీ సంతకాలతో రెండు చెక్కుల ద్వారా కుమారుడు రూ.15.90లక్షలను తన ఖాతాకు మళ్లించుకున్నాడన్నారు. 10రోజుల క్రితం ఈ విషయమై సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కుమారుడి నుంచి నగదును రికవరీ చేయడంతో పాటు కుమారుడి నుంచి బ్యాంకు లాకర్ తాళాలు, ఆస్తి పత్రాలు, వస్తువులు, బ్యాంకు చెక్కులను ఇప్పించాలని, మహబూబాబాద్‌కు చెందిన వియ్యంకుడి నుంచి ప్రాణ భయం ఉందని, తమకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

## చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మఠంపల్లి, మే 1: రహదారిపై ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు తీవ్ర గాయపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మఠంపల్లి మండలం ఎర్రగట్టు వద్ద గత నెల 28వ తేదీ రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం గోవిందాపురానికి చెందిన దగ్గుబాటి రామనర్సు, కంకణాల రాములు మఠంపల్లిలో బంధువుల గృహప్రవేశానికి హజరై తిరిగి వెళుతుండగా ఎర్రగట్టు సమీపంలో రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. గాయపడిన వారిని 108లో హుజూర్‌నగర్, ఈ తర్వాత సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో రామనర్సు(35) మృతిచెందాడు. రాము పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాదుకు తరలించారు. మూడు రోజులుగా హైదరాబాద్‌లో చికిత్సపొందుతున్న కంకణాల రాము(26) బుధవారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.

## తాటిచెట్లు, పైపులు, గడ్డివాము దగ్ధం



ఆత్మకూర్ (ఎస్), మే 1 : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎం) మండల పరిధిలోని గట్టికల్ గ్రామ శివారులో గుండువారి బావి సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలను కాల్చడానికి నిప్పు పెట్టారు. మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగింది. మంటల తీవ్రతరం పెరిగి తాటిచెట్లు, వ్యవసాయ బావుల వద్ద ఉన్న పైపులు, వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద తీవ్రతరం కావడంతో కొంతమంది స్థానికులు సూర్యాపేట ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. ప్రమాద స్థలానికి చేరుకున్న ఫైర్ వాహనంతో సిబ్బంది మంటలు ఆర్పివేశారు. సుమారు 20ఎకరాలకుపైగా వరి కొయ్య కాళ్లు, గడ్డి కాలిపోయాయి.

## 'పది' ఫలితాల్లో మదర్ థెరిస్సా విద్యార్థుల ప్రతిభ



10 జీపీఏ సాధించిన హిమశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్ సురేష్, ఉపాధ్యాయులు

**భువనగిరి టౌన్, మే 1:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో భువనగిరిలోని మదర్ థెరిస్సా స్కూల్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. 99శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. సీహెచ్ హిమ శ్రీ 10జీపీఏ సాధించగా మరో 19 మంది విద్యార్థులు 9 పైబడి జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాణసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉత్తమ ఫలితాలు పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యానికి ప్రతీక అని కరస్పాండెంట్ చిన్నన్ సురేష్ అన్నారు.

## గౌతమి హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



గౌతమి హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**భూదాన్‌పోచంపల్లి, మే 1:** పట్టణంలోని గౌతమి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో 10 జీపీఏ మార్కులు సాధించి ప్రతిభను చాటిన అర్థం లోకేష్, ఆకుల విశాల్‌తేజ్‌ను బుధవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నివాసంలో విద్యార్థులను, పాఠశాల యాజమాన్యం రావుల జంగయ్యను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివిన విద్యార్థులకు ఎల్లప్పుడూ భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఇష్టంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో మర్రి నర్సింహారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రావుల జంగయ్య, ఉపాధ్యాయులు పాండురంగం, బెనర్జీ పాల్గొన్నారు.

## పోచంపల్లి బ్యాంకుకు మరో ఐదు నూతన శాఖలు

**భూదాన్‌పోచంపల్లి, మే 1 :** ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతనంగా మరో ఐదు శాఖలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి మంజూరు చేసిందని బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకట బాలసుబ్రహ్మణ్యం, సీఈవో సీత శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో తొమ్మిది శాఖలతో 357 కోట్ల వ్యాపారం, రూ. 2.57 కోట్ల నికర లాభంతో ముందుకు దూసుకెళ్తున్న పోచంపల్లి అర్బన్ బ్యాంకుకు ఇబ్రహీంపట్నం, ఆమనగల్, కల్వకుర్తి, తుర్క ఎంజాల్, కొండమల్లేపల్లి పట్టణాల్లో నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి లభించిందన్నారు. ఖాతాదారులకు అత్యున్నత సాంకేతికతతో కూడిన సేవలు అందిస్తూ ప్రతి ఏటా ఉత్తమ అర్బన్ బ్యాంకు అవార్డులను కైవసం చేసుకుంటూ అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. సమావేశంలో అర్బన్ బ్యాంకు వైస్‌చైర్మన్ సూరపల్లి రమేష్, డైరెక్టర్లు సీత దామోదర్, బోగ విజయ్‌కుమార్, చిక్క కృష్ణ, పున్న లక్ష్మీనారాయణ, కొండమడుగు ఎల్లస్వామి, కడవేరు కవిత, పిల్లలమర్రి అర్చన, రాపోలు వేణు, బిట్ల భాస్కర్, మేనేజర్ రాచకొండ మధుసూదన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం



సుందరయ్య చిత్రపటానికి పూలమాలు వేస్తున్న సీపీఎం నాయకులు

**వలిగొండ, మే 1:** దక్షిణభారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య, జీవితం నేటి తరానికి ఆదర్శం అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సుందరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెరిగిన పుచ్చలపల్లి సుందరయ్య పేదప్రజలు, వ్యవసాయ కూలీలు, కార్మికుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఎంపీగా ఉండి సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి రాజకీయాల్లో అందరికీ ఆదర్శంగా నిలిచిన గొప్ప మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల రాజయ్య, సిరిపంగి స్వామి, కూర శ్రీనివాస్, రామ్‌చందర్, వెంకట్‌రెడ్డి, సురేష్, నర్సింహ, భిక్షపతి, నాగరాజు, యాదగిరి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**భూదాన్‌పోచంపల్లి, మే 1:** మండల పరిధిలోని వంకమామిడి గ్రామంలో జడ్పీహెచ్ఎస్‌లోని 2008-09 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, సత్తయ్య, వెంకటేశ్వర్లచారి, విద్యార్థులు కాసుల చందు, ప్రియాంక, మమత, సతీష్, శంకర్, పరమేశ్వరి, శిరీష, మహేష్ పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

**ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా వామపక్షాలు, వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. పనిగంటల విధానం కోసం చికాగో నగరంలో పోరాడిన కార్మికులపై ఆనాటి పాలకులు జరిపిన మారణకాండను మరోసారి గుర్తు చేసుకున్నారు. అమరుల స్ఫూర్తితో కార్మిక రక్షణ చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలని కార్మిక నాయకులు పిలుపునిచ్చారు.**

**ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్:** మేడే వేడుకలను జిల్లా కేంద్రం భువనగిరిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, సీఐటీయూ జిల్లా అధక్ష కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం వేరువేరుగా అరుణ పతాకాలను ఎగురవేసి మేడే స్ఫూర్తితో హక్కుల సాధనకు కార్మికులు ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాయ కృష్ణ, సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలలో జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు, అసంఘటిత కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు నిరంతరం పోరాడుతుమన్నారు. కార్యక్రమంలో నాయకులు సామల శోభన్‌బాబు, వెంకటేష్, భాస్కర్ ఉన్నారు.

● రామన్నపేటమండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ ఇతర పార్టీల కార్మిక సంఘాలు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక శ్రమ దోపిడీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ తదితర నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన, గురుకుల, మోడల్ స్కూల్, హాస్టల్స్ కార్మికులు, ఐకేపీ కార్మికులకు నెలకు రూ.25వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, శివరాత్రి సమ్మయ్య, నరసింహ, నంగలూరు యాదయ్య, సుదర్శన్, మల్లయ్య, భగవంతయ్య పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మేక అశోక్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జెల్లల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు బోయిని ఆనంద్, గాదె నరేందర్, గొరిగె సోములు, కందుల హనుమంత్, వైస్ఎంపీపీ నాగటి ఉపేందర్, బోగ సహదేవ్, పాల్వంచ లక్ష్మీ, శ్రీనివాస్, ఆయుద అంజనేయులు, శంకర్, కాటమయ్య, శ్రవణ్ పాల్గొన్నారు.

● వలిగొండ మండలంలో మేడే ఉత్సవాలను సీపీఎం, సీపీఐ, సీఐటీయు, ఏఐటీయుసీ, పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారీ ఐలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు, నాయకులు మద్యల రాజయ్య, సిరిపంగి స్వామి, సీపీఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, మహేష్, వీరస్వామి, సాయికుమార్, దేవేందర్, క్రిష్ణకుమార్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఏఐటీయూసీ హామాలీ సంఘం అధ్యక్షుడు లోడి అయిలయ్య, మెకానిక్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు వనం నరేష్, గౌరవ అధ్యక్షుడు అంజిరెడ్డి, సీఐటీయూ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు పోలెపాక ఉప్పలయ్య, ఆటో, ట్రాలీ యూనియన్ అధ్యక్షులు ఎండి.హాజీమెద్దీన్, టిఎన్‌టియూసీ లేబర్ యూనియన్ అధ్యక్షుడు బద్దుల నర్సింహ జెండాలు ఎగురవేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు మేడే వేడుకలు నిర్వహించలేదు. కార్యక్రమాలల్లో సీపీఐ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

● సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం వద్ద జిల్లా కమిటీ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు చెరుపల్లి లక్ష్మయ్య, ఐఎన్‌టియూసీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు రాచకొండ లింగస్వామి, సీపీఎం కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దోనూరి నర్సిరెడ్డి మేడే జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, విడమ్ సాయి, సింగం కృష్ణ, కరెంటోతు ప్రజ్ఞానాయక్, కృష్ణ, మారయ్య, రమేష్ పాల్గొన్నారు.

● మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంతో పాటు మండలంలోని పాలడుగు, రాగిబావి, దత్తప్పగూడెం, కొండగడప గ్రామాలలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్మికులు ఊరేగింపులు నిర్వహించి వాడవాడలా కార్మిక జెండాలు ఎగురవేశారు. ఐఎన్‌టీయూసీ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కోఆప్షన్ సభ్యుడు గనగాని నర్సింహ, నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కూరెల్ల రాములు, ఎండి.సమీర్, పల్లపు సమ్మయ్య, కారుపోతుల వెంకన్న, పల్లె బిక్షం పాల్గొన్నారు. ఏఐటీయూసీ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, నాయకులు జంగ నర్సయ్య, పురుగుల మారయ్య, తొంట తిరుపయ్య, నిమ్మల బిక్షం, జంగ సతీష్, బోడ శ్రీరాములు, అన్నెపు వెంకట్, పోచం కన్నయ్య పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లు



భువనగిరిలో సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

యాదగిరి, నాయకులు గుండు వెంకటనర్సు, సామ శ్రీనివాస్‌రెడ్డి, పసునూరి చంద్రారెడ్డి, దడిపెల్లి ప్రభాకర్, సుదర్శన్, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పట్టణంలో సీఐటీయు, ఏఐటీయుసీ, ఐఎన్‌టీయుసీ ల ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఎగురవేశారు. ర్యాలీలు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి. పాషా, గోశిక స్వామి, సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయ రామచందర్, కాంగ్రెస్ మునిసిపాలిటీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ జెండాలను ఎగుర వేశారు.

● మోటకొండూర్ మండల కేంద్రంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూ, సీపీఐ జెండాలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, సీఐటీయూ, సీపీఎం జెండాలను సీపీఎం, సీఐటీయూ జిల్లాకమిటీ సభ్యుడు బొలగాని జయరాములు, కొల్లూరి అంజనేయులు, ఐఎన్‌టీయూసీ జెండాను కొల్లూరి బిక్షపతి ఎగురవేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి, రేగు సిద్ధయ్య, సీపీఐ మండల కార్యదర్శి గాదేగని మాణిక్యం, అలేటి బాలరాజు, బోగ రమేష్, బందెల పోషయ్య, చీరాల ఉపేందర్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించి, జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చేడే చంద్రయ్య, జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్, ఏఐటీయూసీ ఆటో యూనియన్ మండల నాయకులు ఎలిజాల అశోక్, గడ్డం శంకరయ్య, బాలెంల పరుశురాములు, పనికిరా సూర్యకుమార్, రాచకొండ రమేష్, వల్లంభట్ల రవీందర్, రాచకొండ సతీష్ ఉన్నారు.



చౌటుప్పల్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు పాషా

● భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ఏఐటీయూసీ అనుబంధ ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కొండమడుగు సత్తయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు తంగెల్ల దశరథ, మండల నాయకులు చేరాల ప్రేమ్‌కుమార్, గోరుకంటి నవీన్, చామల లింగస్వామి, ధనుంజయ, బుగ్గ నాగేష్, మోటె మల్లేష్, పొన్నమోని సాయిలు పాల్గొన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మేడే ఉత్సవాల్లో కార్యదర్శి పగిల్ల లింగారెడ్డి, నాయకులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, కోట రామచంద్రారెడ్డి, జగన్, లక్ష్మయ్య, అనిల్‌రెడ్డి, యాదగిరి, కృష్ణ, క్రాంతి, సత్తయ్య వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు కుక్క దానయ్య, కుక్క కుమార్, చెన్నబత్తిని యాదగిరి, కీర్తి భాస్కర్, గునిగంటి వెంకటేష్ గౌడ్, సామల సుధాకర్‌రెడ్డి, కుక్క బాలరాజు, పరమేష్ పాల్గొన్నారు.

● ఆలేరు మండలంలోని పలు గ్రామాల్లో న్యూ డెమోక్రసీ సీపీఐ, సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల జెండాలను ఎగురవేసి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆలేరుతో పాటు కొలనుపాక, మందెనపల్లి, శర్భాణాపురం గ్రామాల్లో జరిగిన వేడుకల్లో జనార్ధన్ పాల్గొన్నారు.

● రాజాపేట మండలంలోని రాజాపేట, రఘునాథ్‌పురం, బొందుగుల, బేగంపేట తదితర గ్రామాల్లో మే డేను ఘనంగా నిర్వహించారు. సీపీఐ, ఐఎఫ్‌టీయూ, సీపీఎం, కార్మిక సంఘాలు ర్యాలీ నిర్వహించాయి.

● తుర్కపల్లి మండల కేంద్రంలోపాటు మండలంలోని మాదాపూర్, దత్తాయపల్లి, కొండాపూర్, ముల్కలపల్లి గ్రామాల్లో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో, తుర్కపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో సీపీఐ, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు, సీపీఐ, ఏఐటీయుసీ, భవన నిర్మాణ రంగ కార్మికులు, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● బొమ్మలరామారం మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం మాట్లాడారు. కార్మిక, కర్షక హక్కుల సాధనకోసం నిరంతరం పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో ముక్కర్ల పున్నమ్మ, నాగరాజు, నర్సమ్మ, ఎల్లయ్య, లక్ష్మయ్య, బిక్షపతి, భారతమ్మ, స్వామి, రమేష్ పాల్గొన్నారు.



రామన్నపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకుడు ఊట్కూరి నర్సింహ



యాదగిరిగుట్టలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



రాజాపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

## పథకాల అమలులో కాంగ్రెస్ ముందంజ

**రాజాపేట, మే 1:** సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ముందంజలో ఉందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. తనను గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టి కేసీఆర్ జైలుకు పంపడం ఖాయమని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం పార్లమెంట్‌లో ఎంతో కృషి చేసి తెలంగాణ సాధించామని, సాధించిన తెలంగాణను అప్పులు పాలు చేశాడని విమర్శించారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేందర్ గౌడ్, పెంటయ్య, బాలరాజు, శ్రీకాంత్ పాండు పాల్గొన్నారు.



రాజాపేట: రోడ్‌షోలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



రామన్నపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**రామన్న పేట:** భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో జినుకల ప్రభాకర్, జెల్ల వెంకటేశం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్, మాజీ మేజర్ గ్రామసంచాయతీ సర్పంచ్ శిరిష పృథ్వీరాజ్, ఎంపీటీసీ సభ్యులు మహమ్మద్ రెహాన్ సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, మహమ్మద్ నాసర్, సాల్వేర్ లింగం, మహమ్మద్ అక్రం, మీర్జా బషీర్ బేగ్ కేశవ్‌దాస్, వెంకటేశం, అముదా లక్ష్మణ్, మహమ్మద్ మహబూబ్ అలీ, కోట సుధాకర్, బొడ్డు శంకరయ్య, శివ పాల్గొన్నారు.

**సంస్థాన్ నారాయణపురం :** పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈనెల 2న సాయంత్రం సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార రోడ్ షో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మునగాల రమణారెడ్డి, గుత్త రవీందర్‌రెడ్డి తెలిపారు.

## ఆయిల్‌పామ్ రైతులు జాగ్రత్తలు పాటించాలి



రైతులకు సూచనలు చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

**చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 1:** వేసవి నేపథ్యంలో ఆయిల్‌పామ్ తోటల రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని ఆయిల్‌ఫెడ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని చిన్నకొండూర్‌లో అయిల్‌పామ్ సాగు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత 45 డిగ్రీలు నమోదువుతున్న నేపథ్యంలో అయిల్‌పామ్ మొక్కలకు రెండు వైపులా మైక్రో జెట్స్ ద్వారా నీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి కవిత, అయిల్‌ఫెడ్ జిల్లా ఇంచార్జి ప్రవీణ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ హరీష్‌కుమార్, ఎంఓ గణేష్, కిష్టయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## శాంతి భద్రతల కోసమే ఫ్లాగ్ మార్చ్: ఏసీపీ



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

**భూదాన్‌పోచంపల్లి, మే 1:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి నేతాజీ విగ్రహం వరకు ప్రధాన రహదారిపై పోలీసు బలగాలతో ఆయన ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, భూదాన్‌పోచంపల్లి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఎఎస్ఐ సైదిరెడ్డి, శంకర్‌నాయక్, సిబ్బంది షరీఫ్, హుస్సేన్, వెంకటేష్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌వి అసత్య ప్రచారాలు

**భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, మే 1:** ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా మాటలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వక్రీకరిస్తూ అబద్ధపు ప్రచారాలతో పూట గడుపుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. బుధవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి స్థానంతో కలిపి బీజేపీ 400 సీట్లతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి కొలువు తీరనుండడం ఖాయమైనందున ఆ రెండు పార్టీల నాయకులు ఓర్వలేక విషం చిమ్ముతున్నారన్నారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుతున్నది బీజేపీ మాత్రమేనని అన్నారు. ఈ సందర్భంగా చొల్లేరు గ్రామ ఆర్ఎంపీ నరేష్‌చారితో పాటు పలువురు పార్టీ జిల్లా అధ్యక్షుడి సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బెల్లంకొండ ఉపేందర్, నాగేల్లి శ్రీనివాసరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా తంగళ్లపల్లి నాద బ్రహ్మచారిని నియామిస్తు జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాలు అందజేశారు. బీజేవైఎం సమావేశంలో భువనగిరి పార్లమెంట్ ప్రభారి గౌలికార్ దినేష్‌జీ మాట్లాడుతూ ఈ నెల 4న చౌటుప్పల్‌లో పార్లమెంట్ స్థాయి యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంది మహేందర్ గుప్తా, పట్నం శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, బీజెవైఎం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, డి.లక్ష్మీనారియణ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రత్నపురం బలరాం పాల్గొన్నారు.

● భువనగిరి మండలంలోని హన్మాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, మండల అధ్యక్షుడు చీర్క సురేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాటూరి అనిల్‌గౌడ్, నాయకులు పనుమటి మాణిక్యంరెడ్డి, నాగు వినోద్, జ్ఞానేశ్వర్, వేణు ఉన్నారు.

**వలిగొండ:** మండలంలోని అరూరు గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీఎన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, మండల పార్టీ అధ్యక్షులు సుదర్శన్ నాయకులు సత్తయ్య, క్రిష్ణ లక్ష్మి, లింగస్వామి, దయాకర్, రంజిత్‌రెడ్డి, వెంకటేషం పాల్గొన్నారు.

**భూదాన్‌పోచంపల్లి :** బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ గెలుపు తథ్యం అని, దేశాభివృద్ధి కావాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం అన్నారు. మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ విజయం కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుండ్ల రాజుయాదవ్, రాష్ట్ర నాయకులు సుర్కంటి రంగారెడ్డి, జిల్లా నాయకులు మేకల చొక్కారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి భైరు వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

**రామన్న పేట:** మండల కేంద్రంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపును కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారి, బీజేపీ సీనియర్ నాయకులు నక్క చంద్రకళ, కొమ్ము యాదయ్య, సింగం, లింగయ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షులు గుంటోజు కృష్ణమాచారి, వెంకటేష్‌యాదవ్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

**మోత్కూరు :** మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పసునూరి యాదయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు తీగల శ్రీధర్, మోత్కూరు పట్టణ పద్మశాలి సంఘం డైరెక్టర్ పసునూరి యాదమ్మ, దూదిమెట్ల తిరుపతిరెడ్డి, చిప్పలపల్లి కృష్ణ బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, సీనియర్ నాయకుడు ఏనుగు జితేందర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వారు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్‌కు ఓటు వేసి గెలిపించాలని మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, నాయకులు కొనతం నాగార్జునరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, బ్రహ్మచారి, బీసు మధు పాల్గొన్నారు.



భువనగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు